అద్దె భవనాలతో అగచాట్లు

- ఐదు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అందని అద్దె
- గృహ యజమానుల నుంచి కార్యకర్తలకు తప్పని ఒత్తిళ్లు
- అప్పులు చేసి అద్దెలు చెల్లించలేక అంగన్‌వాడీల అవస్థలు



అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

కోనేరుసెంటర్: చిన్నారులకు చదువుతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ సెంటర్‌ల నిర్వహిస్తున్న కార్యకర్తలకు భారంగా మారింది. కొన్ని నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె బకాయిలు అందకపోవటంతో సెంటర్‌ల నిర్వహణ కార్యకర్తలకు కష్టంగా మారింది. నెలల తరబడి బిల్లులు మంజూరు కాకపోవటంతో గత్యంతరం లేని అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పులు తెచ్చి అద్దెలు చెల్లిస్తున్నారు. తద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు నెలల తరబడి అప్పుల వేధింపులు తట్టుకోలేక బకాయి బిల్లులు కోసం ఎదురుచూస్తున్నారు.

అధికంగా అద్దె భవనాల్లోనే..

మచిలీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మచిలీపట్నంకు సంబంధించి 77 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, బందరు గ్రామీణప్రాంతంలో 76 కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు గూడూరులో మరో 60 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో బందరు రూరల్‌కు సంబంధించి మినీ కేంద్రాలు 21, అర్బన్‌లో 2, గూడూరుకు సంబంధించి మరో రెండు కేంద్రాలు ఉన్నాయి. మొత్తంగా మచిలీపట్నం పరిధిలో 245 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే అర్బన్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నీ దాదాపు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో ఆయా కేంద్రాలలో సరైన వసతులు కూడా ఉండటం లేదు. పిల్లలు ఆడుకునేందుకు కనీస వసతులు ఉండని దుస్థితి నెలకొంది.

ఐదు నెలలుగా బకాయి..

బందరు నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టు పరిధిలో 213 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి కేవలం 83 మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 31 కేంద్రాలు ఉచిత అద్దె భవనాల్లో అంటే పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి. మిగిలిన 99 కేంద్రాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న సదరు 99 కేంద్రాలకు గడిచిన ఐదు నెలలుగా అద్దె చెల్లించని దుస్థితి నెలకొంది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అద్దెలు చెల్లించలేక యజమానులకు ఏమీ చెప్పలేక మొహం చాటేయాల్సి వస్తోందంటున్నారు. కొంత మంది అయితే చేసేది లేక అప్పుతెచ్చి అద్దెలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.28.90 లక్షల బిల్లులు పెండింగ్..

మచిలీపట్నం ఐసీడీఎస్ పరిధిలో 99 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ప్రతి నెలా అద్దెలు లక్షల్లో చెల్లించాల్సి ఉంది. అర్బన్‌లో అయితే ఒక్కో సెంటర్‌కు సరాసరిన రూ.6 వేలు, రూరల్ పరిధిలోని సెంటర్లకు రూ.2000 చొప్పున నెలకు అద్దె చెల్లించాల్సి ఉంది. ఈ చెల్లింపులు గత ఐదు నెలలుగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ సెంటర్‌లకు ఎక్కడా ఎలాంటి పెండింగ్‌లు లేకుండా బిల్లులు మంజూరు అయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో రూపాయి కూడా తమ ఖాతాల్లోకి అద్దె బిల్లులు జమ కాలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ రిలీజ్ కాగానే జమ చేస్తాం..

అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయిలు ఉన్న మాట వాస్తవమే. బడ్జెట్ రిలీజ్ కాగానే అందరి ఖాతాల్లోకి జమ చేస్తాం. మూడు నెలల బకాయిలు మాత్రమే ఉన్నట్లు గుర్తు. ఇబ్బందులు ఉన్నా బాధ్యతగా కేంద్రాలను నడపాలి. బకాయిలు వచ్చే వరకు సంయమనంతో ఉండాలి.

– గ్లోరి, సీడీపీవో, బందరు ఐసీడీఎస్ ప్రాజెక్టు

సుప్రీం కోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ నేతలు

కోడూరు: హంసలదీవిలో పర్యటించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎస్.వి.ఎన్. భట్టిని అవనిగడ్డ బార్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వేణుగోపాలుడి ఆలయంలో న్యాయమూర్తి భట్టిని కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందించారు. అవనిగడ్డ పోలీసులు, కోడూరు రెవెన్యూ అధికారులు న్యాయమూర్తికి పూలమొక్కలను అందించారు. అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకారఘురాం ప్రసాద్, ఉపాధ్యాక్షుడు చెన్ను నాగ మల్లేశ్వరరావు, ఏజీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, ఏపీపీ చిట్టిప్రోలు వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు న్యాయమూర్తికి పూలమొక్కను అందిస్తున్న న్యాయవాదులు

ఏబీ వ్యవస్థాపకుడు పట్టాభి విగ్రహానికి నివాళి

మచిలీపట్నంటౌన్: ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య 144వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారిలోని ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపక బ్రాంచ్ వద్ద ఉన్న పట్టాభి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ నాడు పట్టాభి దూరదృష్టితో ఆంధ్రాబ్యాంక్‌ను ఏర్పాటు చేయటంతో దేశ ఆర్థిక పరిపుష్టికి బాటలు వేయటమే కాకుండా లక్షలాది మందికి జీవనోపాధి చూపారన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో అగ్రశ్రేణి నాయకుడిగా ఆయన పని చేయటం ఈ ప్రాంత వాసులుగా మనందరికీ గర్వకారణమన్నారు. ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపక బ్రాంచ్‌లోని పట్టాభి విగ్రహానికి యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టాభి సేవలను స్మరించుకున్నారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ కే వెంకట్రావు, ఏపీ బీఆర్ఎఫ్ అధ్యక్షుడు బీవీవీ కొండలరావు, సంఘ నాయకులు కొల్లు సాయిమోహన్, వి. జగన్మోహనరావు తదితరులు పట్టాభి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ సంఘ నాయకులు డాక్టర్ బీ ధన్వంతరీ ఆచార్య, పీవీ ఫణికుమార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు నివాళులు అర్పించారు.



పట్టాభి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్యాంక్ అధికారులు, సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు

ఓటు నమోదు ప్రత్యేక శిబిరాల పరిశీలన

పెడన: పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి, చిరునామాలు మార్చుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, ఆన్‌లైన్, లేదా తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. ఆదివారం పట్టణంలో పోలింగ్‌బూత్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు. బీజేకే జెడ్పీహెచ్ఎస్, బంగ్లాస్కూలులోని బూత్ లెవల్ అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోపాలరావు మాట్లాడుతూ ఈ ప్రక్రియకు ఆన్‌లైన్‌లో నిరంతరం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.టీపీవో సుగుణకుమారి,బిల్డింగ్‌ఇన్‌స్పెక్టర్ జీతేంద్ర, బీఎల్‌వోలున్నారు.

పెదప్రోలు (మోపిదేవి): మండలంలోని పెదప్రోలు, మోపిదేవి పోలింగ్ కేంద్రాలను ఎలక్షన్ సెక్షన్ ఆఫీసర్ కేఎస్ఎన్ మూర్తి ఆదివారం పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన కనీస మౌలిక సదుపయాల గురించి బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. డీటీ వాణి, ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌వో శ్రీనివాసరావు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు 53 మంది ఎంపిక

నాగాయలంక: అంధత్వ నివారణే లక్ష్యంగా సుదర్శి మానవతా సేవాసంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 47వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజాసంఘాల నాయకుడు తలశిల లీలామనోహర్ ప్రారంభించారు. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి డాక్టర్ శ్రావణి పరీక్షలు చేయగా వీరిలో 53 వృద్ధులను ఐఒఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేశారు. వీరిని ఉచిత శస్త్ర చికిత్సలకై బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్ పాల్గొన్నారు. మత్తి శివ, తలశిల రవి తదితరులు సేవలందించారు.

వైభవంగా కార్తిక సహస్ర దీపాలంకరణ



నాగాయలంకలో శివలింగాకారంలో దీపాలు వెలిగించిన మహిళలు

నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత, కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానం 32వ వార్షిక కార్తిక మాసోత్సవం ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సహస్ర కార్తిక దీపాలంకరణ వైభవంగా జరిగింది. కన్యకాపరమేశ్వరి ఆలయకమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆధ్వర్యంలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు, తాడికొండ సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులు పూజ జరిపి భారీ ప్రమిదల్లో జ్యోతిని వెలిగించారు. చిట్టా వాణి నేతృత్వంలో స్థానిక సంకర్షణ భజన మండలి సభ్యులు వివిధ కళాకృతులలో కార్తిక ప్రమిదలను ఏర్పాటు చేయగా భక్తులు ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. చైర్మన్ సాంబశివరావు, రాచంశెట్టి పాపారావు కోటివత్తుల జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, కమిటీ సభ్యులు సేవలందించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక వన సమారాధన

మచిలీపట్నంటౌన్: కార్తిక వన సమారాధన కార్యక్రమాలు ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. స్థానిక గాంధీ విద్యాలయం ఆవరణలో ఆర్యవైశ్యుల కార్తిక వన సమారాధన నిర్వహించారు. 130 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. బందరు మండల ఆర్యవైశ్య సంఘ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాపు భవనం నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ నేతలు వేముల కృష్ణ, వేముల శ్రీనివాస్, నాగసాయిశ్రీనివాస్, యెండూరి సురేష్, తాడేపల్లి మెహర్ బాబా పర్యవేక్షించారు. స్థానిక గొడుగుపేటలోని శంకరమఠంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూరి, బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే మూర్తి, ప్రధానకార్యదర్శి వింజమూరి శివరాం, కోశాధికారి మోపర్తి సుబ్రమణ్యం, వైద్యులు డాక్టర్ బి.ధన్వంతరి ఆచార్య, నాయకులు వీఎస్ఎస్ఆర్ శర్మ, పీవీ ఫణి కుమార్, జమ్మలమడక సేతురామయ్య, కందుకూరి సత్యనారాయణ శర్మ, వాడపల్లి బాలాజీ సువర్ణ కుమార్, బొడ్డపాటి కుటుంబరావు, ఓరుగంటి చలం, ముదిగొండ శాస్త్రి పాల్గొన్నారు.



ఆర్యవైశ్య కార్తిక వన సమారాధనలో పేర్నికిట్టు, చిత్రంలో నిర్వాహకులు

సామూహిక కుంకుమార్చన

నాగాయలంక: గ్రామంలో గంగానమ్మ తల్లి ఆలయంలో 13వ వార్షిక కార్తిక వన సమారాధన ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత కమిటీ ప్రతినిధులు ఆలయంలో రజక పూజారుల నేతృత్వంలో అమ్మవారికి సంప్రదాయక పూజ జరిపారు. ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత్ శేఖర శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజ నిర్వహించారు. తలశిల వారి ఆడపడుచులు అమ్మవారికి పూజలు చేశారు. వెయ్యి మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.కమిటీ ప్రముఖులు తలశిల శివరామకృష్ణ, టి. వెంకటనరసింహారావు(తాతయ్య) పర్యవేక్షించారు.

నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో ఆదివారం నగరేశ్వరుడుకి మారేడు దళాలతో విశేష పూజ జరిపారు. 32వ వార్షిక కార్తిక మాసోత్సవాలలో భాగంగా స్వామికి తొలుత 11 రుద్రాలతో అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో నగరేశ్వరుని శివలింగంపై మారేడు దళాలతో భక్తిశ్రద్ధలతో పూజ జరిపారు.దేసు సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, తాడికొండ సత్యనారాయణ, చిట్టా శివనాగేశ్వరరావు పాల్గొన్నారు. భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో సుబ్బారావు అర్చకత్వంలో అభిషేకాలు పూజ జరిపారు.

చైల్డ్‌హుడ్ గ్రూపు ఆధ్వర్యంలో

అవనిగడ్డ: చైల్డ్‌హుడ్ గ్రూపు ఆధ్వర్యంలో ఎడ్లంక మామిడి తోటలో కార్తిక వనభోజనాలు నిర్వహించారు. కనగాల సత్యం మామిడితోటలో సంస్థ చైర్మన్ మత్తి శ్రీనివాసరావు అధ్యక్షతన సికింద్రాబాద్ మహంకాళి టెంపుల్ అర్చకులు జమ్మలమడక భాస్కరశర్మతొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. దీపారాధన నిర్వహించి వనభోజనాలు చేశారు.

పెడన: స్థానిక శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదాన కమిటీ, అభివృద్ధి కమిటీలు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి రోడ్డులోని చిట్టూరి మాధవరావు తోటలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాచేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా, సంఘ నాయకులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ముమ్మనేని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెంలో ఇటీవల మృతి చెందిన ముమ్మనేని జగన్మోహనరావు కుటుంబ సభ్యులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం పరామర్శించారు. సీడీసీ మాజీ చైర్మన్, మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు బావ ముమ్మనేని జగన్మోహనరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటి వద్ద ముమ్మనేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, మండలి టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు పాల్గొన్నారు.

26న కార్మిక చట్టాలపై నిరసన

బంటుమిల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న మచిలీపట్నంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బంటుమిల్లిలో కరపత్రాలను పంపిణీ చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రజలకు అవగాహన కల్పించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ ఉపసంహరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, వరద ప్రాంతాల్లో నష్టపోయిన రైతులను, మత్స్యకారులను ఆదుకోవాలని పలు డిమాండ్లతో మచిలీపట్నంలో ర్యాలీ, మహాసభ నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. సీఐటీయూ, రైతు సంఘం నాయకులు మాజేటి శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడే బాధ్యత మనదే

కృత్తివెన్ను: మన హైందవ ధర్మాన్ని కాపాడుకుంటూ, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని హిందూ సంఘ నాయకులన్నారు. ఆదివారం మండలంలోని పెదగొల్లపాలెం బీచ్‌లో ఎకల్ ఆచార్యాలతో పాటు పలు హిందూ సంఘాలతో సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా వారు మన ఆచార వ్యవహారాలు, హిందూ సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు అందించాలన్నారు. ఏకల్ అభియాన్ పేరుతో గ్రామాలలో నడుస్తున్న సంస్థలలో ప్రతి ఒక్కరికీ హిందూ సంప్రదాయాన్ని, పెద్దల పట్ల గౌరవాన్ని తెలియజేయాలన్నారు. ముందుగా భరత మాత, దేవీ చిత్రపటాలకు పూలమాలే వేసి పూజలు జరిపారు. అనంతరం అందరూ కలసి వనసమారాధనలో పాల్గొన్నారు. ఆచార్య కార్యాలయ ప్రముఖ్ సురేంద్రబాబు, మంగమ్మ, శాస్త్రి, చిట్టిబాబు, పి.శ్రీనివాస్, శ్రీరామ కొండలరావు, వెంకటశ్రీనివాస్, ఏసురాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర దీపాలంకరణ

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో సోమవారం సహస్రదీపాలంకరణ సేవను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ ఆదివారం తెలిపారు. రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో ఎనిమిది వేల దీపాలను ఎనిమిది వేల మంది భక్తులతో వెలిగించనున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీమన్నారాయణుడి నగరోత్సవం ఉంటుంది.

రోడ్ల పనులు ప్రారంభించకపోతే రద్దు చేయండి

అవనిగడ్డ: 'పల్లె పండుగ' పనులకు సంబంధించి ఈనెలాఖరు లోపు ప్రారంభించని రహదారులను రద్దుచేసి వేరే గ్రామాలకు కేటాయించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం జరిగిన సమీక్ష సమావేశంలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో 43.95కి.మీ మేర 447 సీసీ రోడ్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో 77 రోడ్ల నిర్మాణ పనులు పూర్తికాగా, జీఎస్‌బీ దశలో 177 రోడ్లు, సీసీ ప్రాసెస్‌లో 9 రోడ్లు ఉన్నట్టు తెలిపారు. మరో 50 చోట్ల రోడ్ల పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. 134 రోడ్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉందని పంచాయతీరాజ్ డీఈ పగడాల సురేష్‌బాబు చెప్పారు. ఈనెలాఖరు లోపు పనులు ప్రారంభించని రోడ్లను రద్దు చేసి వేరే గ్రామాలకు కేటాయించాలని ఆదేశించారు. అనుకున్న సమయంలో రహదారుల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పథకం ఏపీఎం రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లోని క్రీడా మైదానంలో ఆదివారం ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవ్ క్రీడల పోటీలు నిర్వహించారు. వాలీబాల్, త్రోబాల్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. సాయంత్రం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. వాలీబాల్ విన్నర్‌గా తాళ్ళపాలెం, రన్నర్‌గా మాట్లం, త్రోబాల్ విన్నర్‌గా అశ్వారావుపాలెం, రన్నర్‌గా భావదేవరపల్లి జట్లు విజేతలుగా నిలవగా వారికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ జగ్గీ వాసుదేవ్ గురూజీ సమాజానికి బహుముఖ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. డీఎస్పీ మురళీధర్, మండలి వెంకట్రామ్, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు భారత్ మోహన్, గన్నే లక్ష్మి, కవిత, నితిన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- **సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు**

బంటుమిల్లి: కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పలువురు వన సమారాధనలు నిర్వహించారు. పాశ్చాపురంలో శ్రీసువర్చలాంజనేయస్వామి ఆలయంలో శ్రీవేదగాయిత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలలో పలువురు దంపతులు పాల్గొన్నారు. పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు వేదమంత్రాల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వనసమారాధనలో బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సంఘం బంటుమిల్లి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. శశికుమార్, ఎ.కాశీవిశ్వేరరావు పాల్గొన్నారు. కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో అప్సా అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక సమారాధన నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అసోసియేషన్ సభ్యులను పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్ ఘనంగా సత్కరించారు. అప్సా జిల్లా అధ్యక్షుడు ఏవీ గౌరీప్రసాద్ ఉన్నారు.

- **కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్తజనం**

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం భక్తజన సందోహంతో కోలాహలంగా మారింది. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగలిశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **ఆలయ ముఖమండపం ప్రారంభం**

టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలో పురాతనమైన భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో దాతలు మెండు శివరామప్రసాద్, నాగేశ్వరి విజయలక్ష్మి రూ.65 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయ ముఖ మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. దాతలు హైదరాబాద్‌లో స్థిరపడిన కోడూరు మండలం నారేపాలెం గ్రామస్తులు కాగా పూర్తిగా వారి ఆర్థిక సౌజన్యంతో ఈ మండపం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేశారు. దాతలు తొలుత యాగశాల ప్రారంభించారు. అనంతరం మండప గృహ ప్రవేశం, శిలాఫలకం ఆవిష్కరించారు. సోమవారం హోమాల అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని దాత శివరామప్రసాద్ చెప్పారు. దాతల కుటుంబ సభ్యులు సర్పంచి బండ్రెడ్డి శివపార్వతి, బండ్రెడ్డి శేషగిరిరావు, శ్రీనివాసరావు, నరసింహారావు, మామిడి వెంకట శివశంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- **సాగర తీరంలో పర్యాటకుల సందడి**

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకుల సందడితో కళకళలాడింది. కార్తికమాసంతో పాటు ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. హైదరాబాద్, నల్లగొండ, విజయవాడ, గుంటూరు, బెంగుళూరుకు చెందిన భక్తులు తీరంలో సందడి చేశారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు ఇసుకతిన్నెలపై వివిధ రకాల ఆటలాడారు. మహిళలు సైకత శివలింగాలు చేసి వాటి చుట్టూ కార్తిక దీపాలు వెలిగించారు. పాలకాయతిప్ప మెరైన్, కోడూరు పోలీసులు తీరం వెంట గస్తీ నిర్వహించారు. భక్తులకు సూచనలిస్తూ అప్రమత్తం చేశారు.

- **పేద కాపులకు చేయూత ఇవ్వాలి**

నాగాయలంక: మండల శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగాయలంక బస్ స్టేషన్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం మండల స్థాయిలో కార్తిక వనభోజనాలు నిర్వహించారు. సంఘం పెద్ద భోగాది నరసింహారావు అధ్యక్షతన సభ జరిగింది. సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి) మాట్లాడుతూ కాపులను ఐక్యదిశగా ముందుకు నడిపే క్రమంలో వారిలో పేదలకు చేదోడుగా ఉండాలనేదే తమ సంకల్పమని చెప్పారు. మండలి వెంకట్రామ్, తదితర పెద్దలు మాట్లాడుతూ కాపులలోని పేదలను ఆదుకోవడం, ఇతర సంక్షేమం కోసం ఇలాంటి సంఘాలు చేయూతనిస్తూ పనిచేయాలని సూచించారు. వనభోజనాల కార్యక్రమాన్ని మండలి రాజా, చిన్నారి ప్రారంభించారు. తోట శ్రీనివాసరావు, బండ్రెడ్డి భాస్కరరావు, కమతం నాంచారయ్య, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

- **నేడు సర్వసభ్య సమావేశం**

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం పదిన్నర గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షత వహిస్తారని, సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆయన సూచించారు.

- **200 మందికి వైద్య సేవలు**

మచిలీపట్నంటౌన్: విజయవాడ విబో హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి వైద్యులు బొబ్బూరి విరజ, తడికమళ్ల విశ్వనాథ్ ఆధ్వర్యంలో జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ వైద్యానికి సంబంధించిన సేవలను అందించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ బొబ్బూరి విరజ మాట్లాడుతూ అనేక రకాల వ్యాధులకు తమ ఆస్పత్రిలో పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, 45 డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పీవీ ఫణి కుమార్, విబో హాస్పటల్ సిబ్బంది బి.వెంకట్రావు, శివకుమార్, ప్రశాంతి, ప్రభాస్, కుసుమ పాల్గొన్నారు.

- **పేద విద్యార్థులకు ఆర్థిక సాయం**

మచిలీపట్నంటౌన్: హైదరాబాద్‌కు చెందిన ఆది వెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిల్లారిశెట్టి వెంకట రమేష్ బాబు ఆరుగురు పేద విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆయన పంపిన రూ.60 వేల మొత్తాన్ని ఒక్కో విద్యార్థికి రూ.10 వేల చొప్పున చెక్కులను ఆది వెలమ సంఘం మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు విద్యార్థులకు అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకట రమేష్ బాబు ప్రతి ఏడాది రూ.4 లక్షల మేర ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. గత ఆరేళ్లుగా ఈ సాయంతో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లారని తెలిపారు. మచిలీపట్నంలో నిర్మాణంలో ఉన్న రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఆయన రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారని పేర్కొన్నారు. సంఘ సభ్యులు పిల్లారిశెట్టి సత్యనారాయణ, మాదిరెడ్డి ఆంజనేయులు, ఈశ్వరరావు, ఇమ్మనేని శోభనాద్రి తదితరులు ఉన్నారు.

- **ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం**

ఘంటసాల: ఎన్టీఆర్ సినీరంగ ప్రవేశం చేసిన సందర్భంగా వజ్రోత్సవం స్థానిక కళాతోరణంలో ఆదివారం నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీరంగ ప్రవేశం చేయకముందు నేషనల్ ఆర్ట్స్ థియేటర్ అనే నాటక సమాజాన్ని స్థాపించారని చెప్పారు. వీటి ద్వారా పలు నాటకాలను ప్రదర్శించేవారన్నారు. ఈ సంస్థలో ఘంటసాలకు చెందిన సినీ నిర్మాత గొర్రెపాటి వెంకటేశ్వరరావు ఉండేవారన్నారు. ఎన్టీఆర్ సినీరంగ ప్రవేశం చేసిన తరువాత ఈ సంస్థ ద్వారానే ఆయనకు తొలి సన్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రిటైర్డ్ వీఆర్వో నిడుమోలు భద్రిరాజు, గుత్తికొండ వెంకటేశ్వరరావు, చంటి, పంచల వెంకటరావు పాల్గొన్నారు.

- **పగిలిన ప్రమాద హెచ్చరిక అద్దం**

అవనిగడ్డ: స్థానిక జెడ్పీ హైస్కూల్ మలుపు వద్ద ప్రమాదాల నివారణకు ఎస్ఐ శ్రీనివాస్ కుంభాకార అద్దాన్ని ఏర్పాటు చేయించారు. ఇక్కడ మలుపు ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఈ అద్దంలో కనబడేలా వీటిని ఉంచారు. ఈ అద్దం పక్కనే కంకర గుట్టలు అన్‌లోడు చేస్తున్న సమయంలో అద్దానికి వాహనం తగిలి పగిలిపోయింది. ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఈ అద్దం దెబ్బతినడంతో ఎదురుగవాహనాలు కనబడటం లేదు.

- **యువకుడి ఆత్మహత్య**

కోనేరుసెంటర్: కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వలందపాలెంకు చెందిన శ్రీకాకుళపు వెంకటసాయి (28) రోల్డుగోల్డు పనులు చేస్తుంటాడు. ఏడు నెలల క్రితం మాచర్లలోని తన మేనకోడలిని వివాహం చేసుకున్నాడు. వెంకటసాయి కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి కడుపునొప్పి భరించలేక సాయి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.